క్లుప్తంగా

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ


శిక్షణనిస్తున్న మాస్టర్ ట్రైనర్ శ్రీహరి

దుబ్బాకటౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల విధులను పోలింగ్ అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఎంఈఓ ప్రభుదాస్ సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఐఓసీ కార్యాలయంలో ఉదయం అక్బర్‌పేట భూంపల్లి, మధ్యాహ్నం వివిధ మండలాల ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల రోజు నిర్వహించే విధుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జహీరోద్దీన్, ఎంపీఓ బాలాజీ, మాస్టర్ ట్రైనర్లు శ్రీహరి, రవీందర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సర్వేకు సహకారం అవసరం


మాట్లాడుతున్న ఏడీఏ మల్లయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): పంటల సర్వేకు రైతులు సహకరించాలని ఏడీఏ మల్లయ్య కోరారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో సాగైన పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ల ప్రకారం పంటలు వివరాలు నమోదు చేయాలన్నారు. దీనివల్ల దిగుబడిని విక్రయించే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్, ఏఈఓ సాయి కుమార్, రైతులు పాల్గొన్నారు.

చెరువు కట్టకు మరమ్మతులు


పనులు పర్యవేక్షిస్తున్న సుశాంత్

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలోగల లక్ష్మీదేవి చెరువుకట్టకు గండిపడే అవకాశం ఉండడంతో అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఇరిగేషన్ ఏఈ సుశాంత్ పర్యవేక్షణలో శుక్రవారం చెరువుకట్టపై మట్టి పోయించి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గండి పడితే సుమారు 200 ఎకరాల పరిధిలోని పంటలు నీటమునిగే ప్రమాదముంటుందన్నారు. వారం రోజుల క్రితం చెరువుకట్ట పొలాలవైపు కుంగిపోతున్నట్లు గుర్తించి మరమ్మతు పనులు చేపట్టామని చెప్పారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

మద్దూరు(హుస్నాబాద్): సీజనల్ వ్యాధులతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ ఆనంద్ సూచించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన స్వస్థ్ నారి సశక్తి అభియాన్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాధుల సోకిన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్వర సేవలందించడమే లక్ష్యం


పాస్‌పుస్తకం అందజేస్తున్న మాతాజీ

వర్గల్(గజ్వేల్): ఖాతాదారులకు సత్వర సేవలందించడమే తమ లక్ష్యమని గౌరారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సీహెచ్ మాతాజీ అన్నారు. ఇందిరా మహిళాశక్తి మిషన్‌లో భాగంగా ఐకేపీ పర్యవేక్షణలో ఏర్పాటైన ఐదు స్వయం సహాయక వృద్ధుల సంఘాలకు శుక్రవారం బ్యాంకు ఖాతాలు తెరిపించి పాస్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పాములపర్తి సీసీ పద్మలత, మహిళలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా గోపి

హుస్నాబాద్: మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా మాటూరి గోపి ఎన్నికయ్యారు. డీలర్ల సంఘం ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. అధ్యక్ష పదవి కోసం గోపి, యాదగిరి పోటీపడ్డారు. ఒక్క ఓటు తేడాతో మాటూరి గోపి ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ ప్రకటించింది. కార్యదర్శిగా గూళ్ల మంగ, కోశాధికారిగా మల్లేశం ఎన్నికయ్యారు.


బెజ్జంకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు

చిత్తూ.. చిత్తుల బొమ్మ..

బతుకమ్మ సంబురాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం అలిగిన బతుకమ్మగా అన్నిగ్రామాలు, పట్టణాలలో పూజించారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి మహిళలు పాటలు పాడి సందడి చేశారు.

ప్రజారోగ్యంపై పట్టింపేది?

తూతూ మంత్రంగా తనిఖీలు
- కాలం చెల్లిన పదార్థాల విక్రయం
- తయారీలో నాణ్యత కరువు
- కానరాని పర్యవేక్షణ

దుబ్బాకటౌన్: ప్రజలు తినే ఆహార పదార్థాల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో పర్యవేక్షణ లేక హోటళ్లు, రెస్టారెంట్‌లు, బేకరీల నిర్వహణ ఇష్టారాజ్యంగా మారింది. అసలు పర్యావేక్షణాధికారులు ఉన్నారా? లేరా? అనే సందేహం వ్యక్తమవుతోంది.

ఫలితం బయట పెట్టని అధికారులు

ఇటీవల దుబ్బాకలోని ఉడిపీ హోటల్లో సాంబారులో పురుగు వచ్చి కలకలం సృష్టించిన ఘటన తెలిసిందే. జిల్లా ఆహార తనిఖీ అధికారి వచ్చి సాంపిల్ తీసుకువెళ్లి నెలలు గడుస్తున్నా దాని ఫలితం బయట పెట్టక పోవడంతో ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

బేకరీల్లో కాలం చెల్లిన కేక్‌లు

పట్టణంలోని కొన్ని బేకరీలలో మున్సిపల్ అధికారుల చేపట్టిన తనిఖీలలో కాలం చెల్లిన కేక్‌లు బయటపడ్డాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు ఎప్పడికప్పుడు సక్రమంగా తనిఖీలు చేపట్టకపోవడంతో బేకరీలు, హోటళ్ల యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతలేని, కాలం చెల్లిన తినుబండారాలను అమ్ముతున్నారని వాపోతున్నారు. అదే విధంగా బేకరీలో ఆహార పదార్థాలు తయారు చేసే ప్రదేశం అపరిశుభ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే ఒక బేకరిలో కుళ్లిన కేక్ విక్రయించగా తిన్న పిల్లలు అనార్యోగం బారినపడ్డారు. అయినప్పటికీ ఆహార తనిఖీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు

ఆహార పదార్థాల్లో ఏ పురుగో, కీటకాలనో గుర్తించినప్పుడు ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే వచ్చి శాంపిల్ సేకరించి ఫలితం బయట పెట్టకుండా చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో తెలియడం లేదని వాపోతున్నారు.


దుబ్బాకలోని ఓ బేకరిలో తనిఖీ చేస్తున్న అధికారి



కాలం చెల్లిన కేక్

అధికారులు తీరు మార్చుకోవాలి



జిల్లాలో కొంత మంది హోటల్, బేకరీ, ఇతర ఆహార విక్రయదారులు ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్నారు. నాణ్యత లేని, కాలం చెల్లిన పదార్థాలను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. దుబ్బాకలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదో అర్థం కావడం లేదు. ఇకనైనా అధికారులు తీరు మార్చుకోవాలి.

– మాదబోయిన శ్రీకాంత్, దుబ్బాక

సహించేదే లేదు..



దుబ్బాకలో బేకరీలు, హోటళ్లు, రెస్టారెంట్లలో అపరిశుభ్ర వాతావరణంలో ఆహారపదార్థాల తయారు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. పరిశుభ్రత పాటించకుంటే జరిమానాలు తప్పవు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదు.

– రమేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

జీవిత లక్ష్యసాధనకు చదువే పునాది

డీఐఈఓ రవీందర్‌రెడ్డి


మాట్లాడుతున్న డీఐఈఓ రవీందర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే చదువే పునాది అని డీఐఈఓ కె.రవీందర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. విద్యార్థుల భవితవ్యంపై తల్లిదండ్రులు, టీచర్ల పాత్ర అన్న అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడానికి అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ కె.శారద, అధ్యాపకులు చంద్రం తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సహకారం అవసరం

సిద్దిపేటఎడ్యుకేషన్/ములుగు(గజ్వేల్)/వర్గల్(గజ్వేల్)/నంగునూరు(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్/హుస్నాబాద్: తల్లిదండ్రుల సహకారం, భాగస్వామ్యం ఉంటేనే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతోపాటు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తామని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశాలలో ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్ సత్యనారాయణరెడ్డి, హిమబిందు మాట్లాడారు. కళాశాలలకు అందిస్తున్న నిధులు, సౌకర్యాలు, విద్యార్థుల స్థితిగతులను తల్లిదండ్రులకు వివరించారు. కోఎడ్యుకేషన్ కళాశాలలో అగ్నిమాపక సీఐ వెంకటేశ్వర్లు అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలో వివరించారు. ఏజీఎంసీ దేవయ్య, సుధాకర్‌రెడ్డి, కనకచంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, నగేశ్, అశోక్ పాల్గొన్నారు. అలాగే ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శశికళ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో విలువ పెరుగుతుందన్నారు. వర్గల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు విద్యార్థుల అకడమిక్, నాన్ అకడమిక్ అంశాలను చర్చించారు. నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ శివకోటి మాట్లాడారు. గతేడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రిటైర్డ్ ప్రిన్సిపాల్ కిషన్ నగదు బహుమతులు అందజేశారు. గజ్వేల్ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్‌గౌడ్, జ్యోతిర్మయి వేర్వేరుగా నిర్వహించిన సమావేశాలలో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల్ని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతి బాటలో తల్లిదండ్రులు, అధ్యాపకులు కలిసి రావాలన్నారు. అలాగే బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు కార్పొరేట్‌కు ధీటుగా ఫలితాలు సాధిస్తున్నామని ప్రిన్సిపాల్ లలిత అన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అగ్ని ప్రమాదాలపై అవగాహన

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు కళాశాలలో ఏర్పాటు చేసిన ఫైర్ సెఫ్టీని ఎలా వినియోగించుకోవాలో డెమో ఇచ్చారు. అనంతరం పూర్వ విద్యార్థినులు లాస్యశ్రీ, సునీతను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ ఆర్థిక సహాయం అందజేత

మర్కూక్(గజ్వేల్): మృతురాలి కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటానని మండల బీఆర్‌ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య అన్నారు. మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన ఉప్పరి గంగవ్వ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకొని మృతురాలి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డేవిడ్, యాదగిరి, కరుణాకర్, ఉపేంద్ర, ఎల్లం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ బినామీ పేర్లతో పంట నమోదు

హుస్నాబాద్: గ్రామాలల్లో దళారులు ప్రవేశించి ఏఈఓలతో రైతులు పత్తి పంట వేయకుండానే బినామీ పేర్లతో పంట నమోదు చేపడుతున్నారని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దళారులు, అధికారులు కుమ్మక్కై నమోదుకు పాల్పడతున్నారన్నారు. పంట నమోదుపై సమగ్రమైన విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

◆ సీనియారిటీ ఆధారంగా అవకాశం కల్పించండి

సిద్దిపేటకమాన్: జీఓ 190ను సవరించి సీనియారిటీ ఆధారంగా అవకాశం కల్పించాలని బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓను సవరించాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, బాలరాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

◆ ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

నంగునూరు(సిద్దిపేట): మహిళలు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి అంజలి రెడ్డి సూచించారు. ఆరోగ్య మహిళ, శక్తి వంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గట్లమల్యాల పీహెచ్‌సీలో 173 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు రాజేందర్, కీర్తిశ్రీ, సూపర్‌వైజర్ ఎల్లవ్వ, కనకయ్య, విజయలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.


శైలపుత్రి.. శక్తి స్వరూపిణి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అన్ని గ్రామాలు, మండలాల్లో ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయాలు, మండపాల్లో కొలువుదీరిన అమ్మవార్లు శుక్రవారం విశేష అలంకరణల్లో దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.


చేర్యాల(సిద్దిపేట): కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు


కొండపాక(గజ్వేల్): లలితా త్రిపుర సందరిగా


మిరుదొడ్డి(దుబ్బాక): లక్కీడ్రాలో చీరలు సొంతం చేసుకున్న మహిళలు


గజ్వేల్‌రూరల్: ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్ ఆవరణలో..


నంగునూరు(సిద్దిపేట): పాలమాకుల వేంకటేశ్వరాలయంలో...


చిన్నకోడూరులో మహిళల కుంకుమార్చన


హుస్నాబాద్: జ్యోతినగర్‌లో పూజల్లో పాల్గొన్న మహిళలు


బెజ్జంకి(సిద్దిపేట): గాగిల్లాపూర్‌లో ..


దుబ్బాక: కుమారీపూజలో భాగంగా పసుపు, పారాణి పెట్టుకొంటున్న చిన్నారులు

వాహనాల తనిఖీ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లి క్రాసింగ్ వద్ద శుక్రవారం రాత్రి ఎస్ఐ చాతరాజు ప్రశాంత్, వాహనాలు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సరైన పత్రాలు లేనివారికి జరిమానా విధించామన్నారు.

దుబ్బాక అభివృద్ధికి సీఎం హామీ

పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి

దుబ్బాక: దుబ్బాక ప్రాంతం అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని పీసీసీ ఉపాధ్యక్షుడు పన్యాల శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దుబ్బాక మున్సిపల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించడంతో రూ.15 కోట్లు మంజూరు చేశారన్నారు. త్వరలోనే మరో రూ.10 కోట్లు కేటాయిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సంజీవరెడ్డి, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీర నారి ఐలమ్మ

భూమి, భుక్తి, విముక్తి పోరాడిన ఐలమ్మ వీర నారి అని పలువురు వక్తలు ప్రశంసించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. రజక సంఘాలు, వివిధ పార్టీలు, ప్రజా సంస్థల నాయకులు ఐలమ్మ చిత్రపటాలు, విగ్రహాల వద్ద నివాళులర్పించారు. సాయుధ పోరాటంలో ఆమె చేసిన పోరాట స్ఫూర్తిని కొనియాడారు.


చేర్యాల(సిద్దిపేట): చాకలి ఐలమ్మ చిత్ర పటానికి నివాలర్పిస్తున్న నాయకులు


వర్గల్(గజ్వేల్): వేలూరులో ఐలమ్మ విగ్రహావిష్కరణ


జగదేవ్‌పూర్‌లో ఐలమ్మకు నివాళులు


కొండపాక(గజ్వేల్): దుద్దెడలో ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీపీ సుగుణ తదితరులు


సిద్దిపేటకమాన్: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు డీసీపీ కుశాల్కర్


గజ్వేల్‌రూరల్: ముట్రాజ్‌పల్లిలో ఐలమ్మ విగ్రహావిష్కరణలో ప్రతాప్‌రెడ్డి తదితరులు


మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలో..


హుస్నాబాద్: ఐలమ్మ చిత్రపటం వద్ద నాయకుల నివాళులు


చిన్నకోడూరు(సిద్దిపేట): రాముని పట్లలో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు


కొమురవెల్లి(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు